సాక్షి
విశాఖపట్నం
శుక్రవారం । 24 । మార్చి । 2023



మర్యాదపూర్వక కలయిక

మేయర్ గొలగాని హరి వెంకటకుమారిని కటక్ మేయర్ సుభాష్ చంద్రసింగ్ దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. 8లో



నగర ఆర్థిక అభివృద్ధే లక్ష్యం

నగర ఆర్థిక అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు మేయర్ గొలగాని హరివెంకటకుమారి తెలిపారు. 8లో



కె.కె.లైన్‌లో పలు రైళ్లు రద్దు

వాల్తేర్ డివిజన్ పరిధిలోని కె.కె.లైన్‌లో ప్రయాణించే పలు రైళ్లను శుక్ర, శనివారాల్లో రద్దు చేశారు. 8లో



తెల్లారిన బతుకులు

ఉగాది పండగను సరదాగా జరుపుకున్నారు.. ఈ సంవత్సరమంతా బాగుంటుందని సంబరపడ్డారు. రేపటి మీద ఆశతో నిద్రకు ఉపక్రమించారు. విధి వారిపై పగపట్టిందేమో.. అంతలోనే వారి బతుకులు తెల్లారాయి. బుధవారం అర్ధరాత్రి రెండంతస్తుల ఇల్లు పేకమేడలా కూలిపోయిన ఘటనలో ముగ్గురు మృత్యువాత పద్దారు. పొట్ట కూటి కోసం విశాఖ చేరిన బిహార్‌కు చెందిన వ్యక్తి, ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం పరీక్షలు రాస్తున్న విద్యార్థి, వచ్చే నెల 3వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు రాయనున్న విద్యార్థిని దుర్మరణం చెందారు. ఎంతో భవిష్యత్ ఉన్న అన్నాచెల్లెళ్లు అనంతలోకాలకు చేరుకోవడంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారి తల్లి కల్యాణి పరిస్థితి విషమంగా ఉంది.



శిథిలాల కింద రామ్‌విలాస్, సాకేటి దుర్గాప్రసాద్, అంజలి



దుర్గాప్రసాద్, అంజలి(ఫైల్)

- ఇల్లు కూలి ముగ్గురు దుర్మరణం
- మృతుల్లో అన్నాచెల్లెలు
- ఐదుగురికి గాయాలు.. ఒకరి పరిస్థితి విషమం
- జీవీఎంసీ 29వ వార్డు రామజోగిపేటలో ఘటన
- బాధితులను ఆదుకుంటాం: మేయర్

దాబాగార్డెన్స్: జీవీఎంసీ 29వ వార్డు పరిధి రామజోగిపేటలో ఒమ్మి అప్పారావుకు చెందిన రెండంతస్తుల ఇల్లు ఉంది. గ్రౌండ్ ఫ్లోర్‌లో బిహార్‌కు చెందిన రామ్‌విలాస్(చోటు) అద్దెకు ఉంటూ జిల్లా పరిషత్ జంక్షన్ వద్ద నూడిల్స్ దుకాణంలో పనిచేస్తున్నాడు. వారం రోజుల కిందట విజయవాడ కృష్ణలంకకు చెందిన కొమ్మిశెట్టి శివశంకర్ అతడు పనిచేస్తున్న నూడిల్స్ పాయింట్ వద్దే పనికి చేరాడు. చోటు వద్దనే శివశంకర్ కూడా ఉంటున్నాడు. అదే ఇంటి మొదటి అంతస్తులో విజయనగరం జిల్లా మెరకముడిదాం మండలం గొల్లల మర్రివలసకు చెందిన సాకేటి రామారావు, భార్య సాకేటి కల్యాణి, కుమారుడు దుర్గాప్రసాద్, కుమార్తె అంజలితో నివాసం ఉంటున్నాడు. ఈ కుటుంబం పదిహేనేళ్లుగా విశాఖలో నివాసం ఉంటోంది. రామారావు ప్రైవేట్ పనులు చేసుకుంటుండగా, అతని భార్య నగరంలోని ఓ ఆస్పత్రిలో నర్స్‌గా పనిచేస్తోంది. కుమారుడు దుర్గాప్రసాద్ ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం పరీక్షలు రాస్తున్నాడు. కుమార్తె అంజలి వచ్చే నెల 3వ తేదీ నుంచి జరగనున్న 10వ తరగతి పరీక్షలు రాయనుంది. రెండో ఫ్లోర్‌లో పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం మండలం దుమ్మంగికి చెందిన సన్నాపు కృష్ణ, భార్య రోజారాణి నివాసం ఉంటున్నారు. వీరు కూడా ఎనిమిదేళ్ల కిందట వలస వచ్చారు. కృష్ణ దండుబజార్ సమీపంలోని ఓ కేటరింగ్‌లో డ్రైవర్‌గా పనిచేస్తుండగా.. అతని భార్య కూడా నగరంలోని ఓ ఆస్పత్రిలో నర్స్‌గా పనిచేస్తోంది.

అసలేం జరిగిందంటే..

బుధవారం ఉగాది పండగను ఘనంగా జరుపుకున్నారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో అద్దెకు ఉంటున్న రామ్‌విలాస్ అర్ధరాత్రి 12 గంటల ప్రాంతంలో ఇంటికి చేరుకున్నాడు. మరో అరగంటకి కొమ్మిశెట్టి శివశంకర్ వచ్చాడు. అప్పటికే సాకేటి రామారావు కుటుంబం, సన్నాపు కృష్ణ కుటుంబం గాఢ నిద్రలోకి జారుకున్నారు. సమయం ఒంట గంట అయింది. కింది ఫ్లోర్‌లో బిహార్‌కు చెందిన చోటు తన సెల్‌ఫోన్ చూసుకుంటూ సేదదీరుతున్నాడు. సహచరుడు శివశంకర్ బాత్‌రూమ్‌కి వెళ్లాడు. ఉన్నట్టుగా ఏదో కదులుతున్నట్టు అనిపించడంతో అతను రూమ్ నుంచి బయటకు వచ్చాడు. అప్పటికే పై రెండు ఫ్లోర్‌లు కూలుతూ కిందకు పడిపోతుండడాన్ని గమనించి బయటకు పరుగులు పెట్టేలోపే మొత్తం ఇళ్లంతా కూలిపోయింది. ఈ ఘటనలో గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న రామ్‌విలాస్(30), మొదటి అంతస్తులో ఉంటున్న దుర్గాప్రసాద్(17), అంజలి(15) మృతి చెందారు. శివశంకర్, సాకేటి రామారావు, సాకేటి కల్యాణి, సన్నాపు కృష్ణ, రోజారాణి గాయాలతో బయటపడ్డారు. వీరిలో కల్యాణి పరిస్థితి విషమంగా ఉంది. వీరంతా కేజీహెచ్‌లోనే చికిత్స పొందుతున్నారు.



సంఘటనపై మేయర్ హరి వెంకటకుమారితో చర్చిస్తున్న కమిషనర్ రాజాబాబు



రామజోగిపేటలో కూలిన రెండంతస్తుల భవనం

సహాయక చర్యలు ముమ్మరం

సమాచారం అందుకున్న రాష్ట్ర విపత్తుల శాఖ, రెవెన్యూ, పోలీసు, ఫైర్ విభాగాలు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నాయి. గురువారం వేకువజాము 2 గంటల నుంచి 7 గంటల వరకు రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. శిథిలాల కింద కూరుకుపోయిన క్షతగాత్రులను బయటకు తీశారు. మృతి చెందిన అంజలి, దుర్గాప్రసాద్, రామ్‌విలాస్‌ను అతి కష్టంపై తీయగలిగారు. క్షతగాత్రులను 108లో కేజీహెచ్‌కు తరలించారు. ఈ ఘటనపై మహారాణిపేట పోలీసులు కేసు నమోదు చేశారు. అధికారులు, నిపుణులతో దర్యాప్తు చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

సంఘటన దురదృష్టకరం: మేయర్

పాత భవనం కూలి ముగ్గురు మృత్యువాత పడడంపై మేయర్ గొలగాని హరి వెంకటకుమారి ఆవేదన వ్యక్తం చేశారు. భవనం కూలిన విషయం తెలిసిన వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఈ సంఘటన దురదృష్టకరమని, భవిష్యత్‌లో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తామన్నారు. బాధిత కుటుంబాన్ని జీవీఎంసీ తరఫున ఆదుకుంటామన్నారు. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు 40 ఏళ్ల నాటి ఈ భవనం కుప్పకూలి ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నట్లు తెలిపారు. ప్రమాద స్థలంలో ఎన్డీఆర్ఎఫ్ 25 మందితో కూడిన బృందం సహాయక చర్యలు ముమ్మరంగా చేపట్టిందన్నారు. పరిసర ప్రాంతాల ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా డెబ్రిస్ తొలగించాలని జోనల్ కమిషనర్‌ను ఆదేశించామన్నారు. జోన్-4 పరిధిలో చాలా వరకు పురాతన భవనాలు ఉన్నాయని, వాటన్నింటినీ పరిశీలిస్తామన్నారు. ప్రమాదం వాటిల్లే భవనాలను ఆయా ఇంటి యజమానులతో మాట్లాడి ఖాళీ చేయించే ప్రయత్నం చేయాలని సూచించినట్లు చెప్పారు.

బాధితులకు కమిషనర్ పరామర్శ

కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు పరామర్శించారు. సంఘటన జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘటన విషయం తెలిసిన వెంటనే జీవీఎంసీ యంత్రాంగం సహాయక చర్యలు ప్రారంభించిందన్నారు. నగరంలో పురాతన భవనాలు గుర్తించి నివేదిక ఇవ్వాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. పురాతన భవనాలను ఆ భవన యజమానులతో మాట్లాడి వాటిని తొలగించేలా చర్యలు తీసుకోవాలని, లేదా జీవీఎంసీ దృష్టికి తీసుకొస్తే.. తొలగించే ప్రక్రియ చేపడతామన్నారు. ప్రమాదపు అంచుల్లో ఉన్న భవనాలు తొలగించాలని అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలను ఆదుకుంటామన్నారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వారికి మెరుగైన వైద్యం అందివ్వాలని అధికారులను ఆదేశించారు.



కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న కొమ్మిశెట్టి శివశంకర్, సన్నాపు కృష్ణ, రోజారాణి, సాకేటి రామారావు, కల్యాణి

స్థాయీ సంఘంలో 32 అంశాలు ఆమోదం



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ మేయర్ హరివెంకటకుమారి

దాబాగార్డెన్స్ : జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన గురువారం నిర్వహించారు. స్థాయీ సంఘం అజెండాలో 34 అంశాలు పొందుపరచగా, వాటిలో 32 అంశాలు ఆమోదం పొందాయని, మిగిలిన 2 అంశాలు వాయిదా వేసినట్లు చైర్‌పర్సన్ తెలిపారు. 1 నుంచి 5 అంశం వరకు ఉద్యోగుల సర్వీస్ రూల్స్‌కి సంబంధించి ఆమోదించగా, 6, 30వ అంశాలను వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. 7 నుంచి 25వ వరకు రెవెన్యూ విభాగానికి చెందిన వాణిజ్య సముదాయాల లీజుకు సంబంధించి అంశాలు ఆమోదం పొందాయి. అలాగే 26వ అంశమైన టెలీకాన్ఫరెన్స్ కోసం కొత్త ఏజెన్సీకి టెండరు ఖరారయ్యే వరకు పాత ఏజెన్సీ కొనసాగించేందుకు సభ్యులు ఆమోదం తెలిపారు. 27 నుంచి 29 అంశాలు ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ అదనపు నిర్మాణాలకు రూ.133.08 లక్షలతో అంచనాలకు ఆమోదం తెలిపారు. అలాగే 31 నుంచి 34 వరకు మెకానికల్ విభాగానికి సంబంధించి వాహనాల మరమ్మతులు, ఏడాది పాటు డ్రైవర్ల నియామకానికి ఆమోదం పొందాయి. కార్యక్రమంలో స్థాయీ సంఘ సభ్యులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

భూముల రీసర్వే వేగవంతం



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జేసీ విశ్వనాథన్

మహారాణిపేట: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకంలో భాగంగా చేపట్టిన సమగ్ర భూసర్వే వేగవంతం చేయాలని సీసీఎల్ఏ స్పెషల్ సీఎస్ జి.సాయిప్రసాద్ అధికారులను ఆదేశించారు. వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయం నుంచి గురువారం ఆయన కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. సర్వే పూర్తైన భూముల వివరాల అప్ లోడింగ్, పునాది రాళ్ల స్థాపన, డ్రోన్ ఫ్లై తదితర అంశాలపై ఆరా తీశారు. సర్వే పూర్తైన భూముల వివరాలు వెబ్‌ల్యాండ్‌లో త్వరితగతిన అప్‌లోడ్ చేయాలన్నారు. ఇప్పటివరకు జిల్లాలో చేపట్టిన సర్వే కోసం జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ వివరించారు. నిర్దేశిత గడువులోగా ఎంపిక చేసిన గ్రామాల్లో భూముల రీసర్వే వేగవంతం చేస్తున్నట్లు చెప్పారు. సర్వే శాఖ ఏడీ విజయకుమార్ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ఐఐఎం విద్యార్థులందరికీ ఇంటర్న్‌షిప్



ఇంటర్న్‌షిప్‌లు సాధించిన విద్యార్థులు

ఏయూక్యాంపస్: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విశాఖపట్నం విద్యార్థులకు శత శాతం సమ్మర్ ప్లేస్‌మెంట్స్ లభించాయి. అత్యధిక స్టైఫండ్‌గా రెండు నెలలకు రూ 2.5లక్షలు సాధించారు. సగటు స్టైఫండ్ రూ.79.88 వేలు. 110 సంస్థలకు మొత్తం 272 మంది విద్యార్థులూ ఎంపికయ్యారు. ఐటీ ఆధారిత రంగాలకు 22 శాతం, ఎఫ్ఎస్ఐ రంగాలకు 19 శాతం, కన్సల్టింగ్‌లో 12 శాతం, ఎఫ్ఎంసీజీలో 8 శాతం, మ్యానుఫ్యాక్చరింగ్‌లో 7 శాతం, ఫార్మా–హెల్త్‌కేర్ రంగంలో 7 శాతం, ఎడ్యుటెక్ రంగంలో 7శాతం, రియల్ ఎస్టేట్–నిర్మాణ రంగంలో 4 శాతం మంది నియామకం అయినట్లు ఐఐఎంవీ సంచాలకుడు ఆచార్య ఎం.చంద్రశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఆయన అభినందించారు.

నేడు సెలబ్రిటీ క్రికెట్ సెమీస్ మ్యాచ్‌లు



అఖిల్

విశాఖ స్పోర్ట్స్: సెలబ్రిటీ క్రికెట్ లీగ్(సీసీఎల్) సెమీస్ ఫైనల్ పోటీలు శుక్రవారం వైఎస్సార్ స్టేడియంలో జరగనున్నాయి. తొలి సెమీస్ మధ్యాహ్నం 2.30 గంటలకు భోజ్‌పురి దంబాగ్–ముంబై హీరోస్ జట్ల మధ్య జరగనుంది. మరో సెమీస్‌లో రాత్రి 7 గంటలకు కర్నాటక బుల్‌డోజర్స్ జట్టుతో తెలుగు వారియర్స్ జట్టు తలపడనుంది. ఫైనల్స్ శనివారం రాత్రి 7 గంటలకు ఫ్లడ్‌లైట్ల వెలుతురులో జరగనుంది. తెలుగు వారియర్స్ జట్టు కెప్టెన్‌గా అఖిల్, మెంటర్‌గా వెంకటేష్ వ్యవహరించనున్నారు. అంబాసిడర్లుగా రెజీనా, ప్రణీత, ఆదాశర్మ ఉన్నారు. జట్టులో సచిన్‌జోషి, అశ్విన్, ధరమ్, ఆదర్స్, నిఖిల్, తరుణ్, విశ్వ, ప్రిన్స్, సుశాంత్ ఆల్‌రౌండర్లుగా రాణిస్తుండగా నంద, సామ్రాట్ బంతితో అలరించనున్నారు. టీ20 మ్యాచ్ అయినా తొలిసారిగా పదేసి ఓవర్లు రెండు ఇన్నింగ్స్‌లుగా పోటీలు జరుగుతున్నాయి. ఈ మ్యాచ్‌లు జీటీవీ ప్రసారం చేయనుంది.

స్టీల్‌ప్లాంట్ కోక్‌ఓవెన్స్‌లో కూలిన కోక్ బకెట్

గాజువాక: స్టీల్‌ప్లాంట్ కోక్‌ఓవెన్స్ ఐదో బ్యాటరీలో కోక్ తీసుకువెళ్తున్న బకెట్ కూలిపోయింది. ఈ సంఘటనలో స్వల్ప ఆస్తినష్టం సంభవించగా అదృష్టవశాత్తు ఎటువంటి ప్రాణనష్టం కలగలేదు. ప్రత్యక్షసాక్షుల కథనం మేరకు.. గురువారం విభాగంలో ఎత్తులో ఉన్న ఐదో సీడీసీపీకి బకెట్‌లో వేడిగా ఉన్న కోక్‌ను తరలిస్తున్నారు. కొంత ఎత్తుకు వెళ్లేసరికి బకెట్‌కు ఉన్న రోప్ తెగిపోయింది. దీంతో బకెట్ కింద పడి అందులో ఉన్న హాట్ కోక్ కిందకు పడిపోయింది. దీంతో ఆ ప్రాంతంలో మంటలు ఏర్పడ్డాయి. వెంటనే సీఐఎస్ఎఫ్ ఫైర్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ సంఘటనలో బకెట్ ధ్వంసం అయింది. బ్యాటరీలో మొత్తం ఐదు బకెట్‌లు ఉండటంతో ఉత్పత్తికి అంతరాయం కలగలేదు. కింద పడిన కోక్‌ను కన్వేయర్ ద్వారా ఉత్పత్తి ప్రక్రియకు పంపనున్నట్టు విభాగం అధికారుల తెలిపారు.

డిప్యూటీ కలెక్టర్లకు బదిలీ

మహారాణిపేట: పలువురు డిప్యూటీ కలెక్టర్లకు బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఆంధ్రప్రదేశ్ మౌలిక సదుపాయాల సంస్థ(ఏపీఐఐసీ) విశాఖ జోనల్ మేనేజర్‌గా పనిచేస్తున్న సిహెచ్ రంగయ్యను వీఎంఆర్‌డీఏ కార్యదర్శిగా నియమించారు. అక్కడ కార్యదర్శిగా పనిచేస్తున్న టి.వేణుగోపాల్‌ను మాతృ సంస్థ రెవెన్యూశాఖకు కేటాయించారు. డిప్యూటీ కలెక్టర్ కె.రమేష్‌నాయుడును శ్రీ కనకమహాలక్ష్మి దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా నియమించారు. ప్రస్తుతం రమేష్‌నాయుడు పెనుగ్రంచిపోలు శ్రీ లక్ష్మీతిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం ఈవోగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం శ్రీ కనకమహాలక్ష్మి ఈవోగా, దేవదాయశాఖ జిల్లా సహాయ కమిషనర్(ఏసీ)గా కె.శిరీష పనిచేస్తున్నారు.

చమురు మోసాలకు చెక్!

- పెట్రోల్ బంకులపై రాష్ట్ర ప్రభుత్వం నిఘా
- ప్రత్యేక ఇన్‌స్పెక్షన్ యాప్ ద్వారా నిరంతర తనిఖీలు
- నాణ్యతతో పాటు కొలతలు, స్టాక్, డెన్సిటీ టెస్టులు



పెట్రోల్ నాణ్యతను పరీక్షిస్తున్న డీఎస్‌వో సూర్యప్రకాష్



పెట్రోల్ బంక్ ఇన్‌స్పెక్షన్ యాప్

సాక్షి, విశాఖపట్నం: పెట్రోల్ బంకుల్లో చమురు మోసాలతో పాటు వినియోగదారులకు మౌలిక సదుపాయాలు కల్పించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం సాంకేతికతను అందుబాటులోకి తీసుకొచ్చింది. నాణ్యతతో పాటు సౌకర్యాలు లేకపోయినా.. బంక్‌లపై చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతోంది. ప్రత్యేకంగా రూపొందించిన ఇన్‌స్పెక్షన్ యాప్ ద్వారా నిరంతర తనిఖీలు నిర్వహించే పనిలో అధికార యంత్రాంగం నిమగ్నమైంది. జిల్లాలోని 88 పెట్రోల్ బంకుల్లో ఆకస్మిక తనిఖీలు చేస్తోంది.

డీఎస్‌వో నేతృత్వంలో తనిఖీలు

సాధారణంగా పెట్రోలు బంక్‌ల్లో కొలతలు, నాణ్యతలో మోసాలను అరికట్టేందుకు అధికారులు ఆకస్మిక తనిఖీలు చేస్తుంటారు. ఈ సమయంలో కొత్తగా రూపొందించిన యాప్‌లో ఆయా పెట్రోల్ బంక్‌ల్లో ఉన్న లోటుపాట్లను పొందుపరచాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ అరుణ్‌కుమార్ జిల్లా అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఇందులో భాగంగా తనిఖీలను యాప్ ద్వారా చేపట్టాలని.. నాణ్యతా పరమైన అంశాలను పరిశీలించి అన్నీ సక్రమంగా ఉన్నాయో లేదో అన్న విషయాలను యాప్‌లో పొందుపరచాలని తహసీల్దార్లు, సీఎస్‌డీటీలకు జేసీ విశ్వనాథన్ ఆదేశించారు. ఈ నేపథ్యంలో డీఎస్‌వో సూర్యప్రకాష్ నేతృత్వంలో తనిఖీలు చేపడుతున్నారు. సాధారణంగా పెట్రోలు బంక్‌ల్లో కనీస సౌకర్యాలు కనిపించని పరిస్థితి. ఈ అంశాలను బేరీజు వేసుకుని కొత్త యాప్‌ను ప్రవేశపెట్టారు.

ఈ సౌకర్యాలు ఉండాల్సిందే..

పెట్రోలు బంక్‌ల్లో మంచినీరు, మరుగుదొడ్లతో పాటు భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారా? ఫ్రీ ఎయిర్ సౌకర్యం కల్పిస్తున్నారా? స్టాక్ బోర్డు ఉందా? అనే విషయాల్ని పరిశీలిస్తారు. వినియోగదారులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలి. అధికారులు తరచూ క్వాలిటీ చెక్ చేయాలి. సాంద్రత, నాణ్యత పరీక్షలు నిర్వహించాలి. అండర్ గ్రౌండ్ స్టాక్ ఎంత ఉంది.? అనే అంశాలన్ని పరిశీలించనున్నారు. తనిఖీల సమయంలో అక్కడ ఉన్న పరిస్థితులను ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. యాప్‌లో ఉన్న అంశాలను అధికారులు సమగ్రంగా పరిశీలించాలి. ఒక వేళ ఆయా సౌకర్యాలు సదరు పెట్రోల్ బంకుల్లో లేనట్లయితే వెంటనే ఆ కల్పించేందుకు చర్యలు తీసుకోవాలి.

ఇప్పటివరకు 61 బంకుల్లో తనిఖీలు



జిల్లాలో మొత్తం 88 పెట్రోలు బంక్‌లు ఉన్నాయి. ఈ యాప్ ద్వారా ఇప్పటివరకు 61 బంక్‌ల్లో తనిఖీలు నిర్వహించాం. ఇది నిరంతర ప్రక్రియగా సాగనుంది. బంకుల్లో నాణ్యతా ప్రమాణాలతో పాటు వినియోగదారులకు కనీస సౌకర్యాలు అందించాలనే లక్ష్యంతో ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టాం. ఎక్కడైనా అవకతవకలు జరిగినట్లు గుర్తిస్తే వెంటనే నోటీసులు జారీ చేసి.. వాటిని ఏర్పాటు చేయాలని గడువు విధిస్తాం. గడువు సమయంలో ఏర్పాటు చేయకపోతే చర్యలకు ఉపక్రమిస్తాం. బంక్‌లో ప్రతి విషయాలను పరిశీలించి వాటి ఫొటోలను యాప్‌లో అప్‌లోడ్ చేస్తాం. ఈ యాప్ ద్వారా చేస్తున్న తనిఖీల వల్ల అక్రమాలకు చెక్ పెట్టవచ్చు. – సూర్యప్రకాష్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

14 నుంచి విశాఖ టు కశ్మీర్ టూర్

తాటిచెట్లపాలెం (విశాఖ ఉత్తర): పర్యాటకుల కోసం ఇండియన్ రైల్వే కేటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) విశాఖ నుంచి కశ్మీర్‌కు ప్రత్యేక ఫ్లైట్ టూర్ ప్యాకేజీని ప్రారంభించింది. ఐఆర్‌సీటీసీ, సౌత్ సెంట్రల్ జోన్ ఏరియా ఆఫీసర్ చంద్రమోహన్ బిసా గురువారం వాటి వివరాలు వెల్లడించారు.

కశ్మీర్–హెవెన్ ఆన్ ఎర్త్ యాత్ర (5రాత్రులు, 6పగళ్లు)..

ఈ టూర్ ఏప్రిల్ 14న విశాఖలో ప్రారంభమై 19న విశాఖలో ముగుస్తుంది. ఈ యాత్రలో భాగంగా గుల్మార్గ్‌లో గల గొండోల పాయింట్, సోనామార్గ్‌లో గ్లాసియర్, పహల్గాంలో గల మిని స్విట్జర్లాండ్, కుంకుమ తోటలు, అవంతిపుర శిథిలాలు, శ్రీనగర్‌లో దాల్‌లేక్‌లో శికర రైడ్, మొఘల్ గార్డెన్స్, షాలిమార్ గార్డెన్స్, పారి మహల్ వంటి పర్యాటక ప్రదేశాలను వీక్షించే అవకాశం ఉంటుంది. ఒకొక్కరికి సింగిల్ ఆక్యుపెన్సీ బస అయితే రూ.62,660 , డబుల్ ఆక్యుపెన్సీ రూ. 47,480, ట్రిపుల్ ఆక్యుపెన్సీ రూ.46,555 (అన్ని పన్నులు, జీఎస్టీతో కలిపి)

ఈ యాత్ర వివరాలు...

- ఈ యాత్రలకు యాత్రికులు ఎంచుకున్న ఆక్యుపెన్సీ (సింగిల్/డబుల్/ట్రిపుల్) రూంను బట్టి చార్జీ వసూలు చేస్తారు.
- ఇండిగో ఎయిర్‌లైన్, ఎకానమీ క్లాస్‌లో విమాన ప్రయాణం
- రాత్రివేళ 3 స్టార్ హోటళ్లలో బస
- విశాఖలో ప్రారంభం మొదలు ఎయిర్‌పోర్ట్ పికప్, డ్రాపింగ్, సైట్ సీయింగ్ అన్ని ఏసీ వాహనాలలోనే..
- ఉదయం అల్పాహారం, రాత్రి భోజనం

ఈ యాత్రలపై మరిన్ని వివరాలకు విశాఖ రైల్వేస్టేషన్ ప్రధాన ప్రవేశ ద్వారం వద్ద గల ఐఆర్‌సీటీసీ కార్యాలయంలో స్వయంగా గానీ, విశాలాక్షి-9701085461, చందన్‌కుమార్ - 82879 32318, నంబర్లలో సంప్రదించాలని ఐఆర్‌సీటీసీ ఏరియా ఆఫీసర్ చంద్రమోహన్ తెలిపారు.

అంబులెన్స్‌ల సప్లైకు సీల్డ్ కవర్ కొటేషన్ల ఆహ్వానం

మహారాణిపేట: కేజీహెచ్‌కు అవసరమైన అంబులెన్స్‌లు సప్లై చేయడానికి సీల్డ్ కవర్ కొటేషన్లను ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. ఏప్రిల్ ఒకటో తేదీలోగా కలెక్టరేట్ ఆవరణలోని సీపీవో కార్యాలయంలో కొటేషన్లు అందజేయాలని కోరారు.

మరిన్ని వివరాలకు సీపీవో కార్యాలయం లేదా డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. కాగా.. ఆస్పత్రికి అవసరమైన అంబులెన్స్‌ల కొనుగోలు కోసం సీఎస్సార్ కింద హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ రూ.2.50 కోట్లు కేటాయించింది. ఇందులో 50 శాతం నిధులను ఆ సంస్థ విడుదల చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు.

క్షయపై అవగాహన కార్యక్రమం నేడు

మహారాణిపేట: ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం పురస్కరించుకుని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. ఏటా మార్చి 24న ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు టి.బి. నివారణ కోసం విస్తృత చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ప్రధానమంత్రి టి.బి.ముక్త భారత్ అభియాన్‌లో భాగంగా టి.బి.రోగులకు మందులు ఇవ్వడంతోపాటు ఉచిత పరీక్షలు, దాతల ద్వారా అదనపు పోషకాహారం అందిస్తున్నట్లు జిల్లా టి.బి.నివారణ అధికారి డాక్టర్ సిహెచ్ పూర్ణేంద్రబాబు తెలిపారు.

నగర ఆర్థిక అభివృద్ధే ప్రథమ లక్ష్యం



- బోట్ రేసింగ్, కైట్ ఫెస్టివల్ పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం
- మేయర్ గొలగాని హరివెంకట కుమారి

బీచ్‌రోడ్డు: నగర ఆర్థిక అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు మేయర్ గొలగాని హరివెంకట కుమారి తెలిపారు. జీ-20 సమ్మిట్ నేపథ్యంలో గురువారం నిర్వహించిన బోట్ రేసింగ్, కైట్ ఫెస్టివల్ పోటీల్లో విజేతలకు ఆర్.కె.బీచ్‌లో ఆమె బహుమతులు అందించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ జీ-20 సదస్సుకు వచ్చే ప్రతినిధులకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించేందుకు నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దినట్లు చెప్పారు. జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు మాట్లాడుతూ జీ-20 సదస్సుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు. జన భాగీదారిలో భాగంగా వర్క్ షాపు, యోగా, బోట్ రేసింగ్, కైట్ ఫెస్టివల్ నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కె.సతీష్, స్టేట్ కల్చరల్ సీఈవో మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీ-20 సదస్సు జెండాతో కోస్ట్‌గార్డ్‌కు చెందిన హెలికాఫ్టర్ సాగరతీరంలో సందడి చేసింది. సుమారు 30 నిమిషాల పాటు ఆర్.కె.బీచ్‌లో చక్కర్లు కొడుతూ సందర్శకులను ఆకట్టుకుంది.



మాట్లాడుతున్న మేయర్ హరివెంకట కుమారి

నాన్ ఫేర్ రెవెన్యూలోనూ వాల్తేరు డివిజన్ ముందంజ

తాటిచెట్లపాలెం (విశాఖ ఉత్తర) : వాల్తేర్ డివిజన్ నాన్ ఫేర్ రెవెన్యూ (ఎన్ఎఫ్ఆర్) టికెటేతర ఆదాయం ద్వారా రైల్వే బోర్డు నిర్దేశించిన గమ్యాన్ని 10 రోజుల ముందుగానే చేరుకుంది. ఏప్రిల్ 2022-మార్చి 2023గాను నాన్ ఫేర్ రెవెన్యూ ద్వారా రూ.5.52 కోట్లు సంపాదించుకోవాలని వాల్తేర్ డివిజన్‌కు రైల్వే బోర్డు నిర్దేశించింది. అయితే ఈ లక్ష్యాన్ని ఈ ఆర్థిక సంవత్సరం ముగింపు ఇంకా 10 రోజుల ఉండగానే చేరుకుంది. గత ఏడాది రూ.3.21కోట్లు నాన్ ఫేర్ రెవెన్యూ ద్వారా ఆర్జించగా ఈ ఏడాది రూ.5.51కోట్లు మార్చి నెలాఖరుకు ఇంకా 10 రోజులుండగానే చేరుకుంది. ఇది గతేడాది కంటే 71.65శాతం అధికం. వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్ అనూప్‌కుమార్ సత్పతి నేతృత్వంలో డివిజన్ బృందం ఆదాయార్జన కోసం చేపట్టిన నూతన ప్రాజెక్టుల వలన ఇది సాధ్యమైంది. వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి నాయకత్వంలో పనిచేసిన అధికారులను డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి అభినందించారు. భారతీయ రైల్వేలో వాల్తేరు డివిజన్ ఒక రోల్ మోడల్ కాబోతుందని డీఆర్ఎం ఆశాభావం వ్యక్తం చేశారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న కారు

- ఇద్దరు దుర్మరణం
- మృతులది శ్రీకాకుళం జిల్లా





లాడే దుర్గాప్రసాద్, పట్నాల సంతోష్‌కుమార్



ఆర్టీసీ బస్సును ఢీకొన్న కారు

తగరపువలస: వలందపేట వద్ద జాతీయ రహదారిపై బుధవారం అర్ధరాత్రి 12.15 గంటల సమయంలో ఆర్టీసీ బస్సును ఓ కారు ఢీకొన్న ఘటనలో ఇద్దరు దుర్మరణం చెందారు. రోడ్ సేఫ్టీ పోలీస్ సిబ్బంది తెలిపిన వివరాలివీ. శ్రీకాకుళం జిల్లా గార మండలం కళింగపట్నానికి చెందిన పట్నాల సంతోష్‌కుమార్(32), రాజరాజేశ్వరిపేటకు చెందిన లాడే దుర్గాప్రసాద్(25) బుధవారం అర్ధరాత్రి విశాఖ నుంచి శ్రీకాకుళం వైపు కారులో ప్రయాణిస్తున్నారు. హైవేపై వలందపేట వద్ద ఆగి ఉన్న లారీ, ఆటోను తప్పించే క్రమంలో డివైడర్‌ను ఢీకొని అవతలి రోడ్డు వైపు కారు దూసుకుపోయింది. అదే సమయంలో పార్వతీపురం నుంచి విశాఖ వైపు వస్తున్న రావులపాలెం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును కారు బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగంగా నుజ్జునుజ్జు కావడంతో డ్రైవింగ్ సీట్లో ఉన్న సంతోష్‌కుమార్, పక్కనే కూర్చున్న దుర్గాప్రసాద్ తీవ్ర గాయాలతో మృతి చెందారు. వెంటనే పోలీసులు ఫోన్ ద్వారా సంతోష్‌కుమార్ తండ్రి నాగేశ్వరరావుకు సమాచారం అందించారు. రాత్రి 10 గంటల సమయంలో సంతోష్‌కుమార్ ఇంటికి ఫోన్ చేసి శ్రీకాకుళం వచ్చేస్తున్నామని తలుపులు వేయవద్దని కోరినట్లు తండ్రి నాగేశ్వరరావు తెలిపారు. ఇంతలోనే అంత ఘోరం జరిగిపోయిందని మృతుల కుటుంబ సభ్యులు వాపోయారు. భీమిలి సీఐ కె.లక్ష్మణమూర్తి, ఎస్ఐ గంటా హరీష్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుల్లో సంతోష్‌కుమార్ తండ్రి సిమెంట్ వ్యాపారంలో తోడుగా ఉండగా.. దుర్గాప్రసాద్ పీ అండ్ జి కంపెనీలో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సముద్ర తీరం.. పరిశుభ్రం

'సాక్షి'మీడియా ఆధ్వర్యంలో ఆర్.కె.బీచ్ క్లీన్



తీరం పరిశుభ్రతలో పాల్గొన్న సాక్షి మీడియా వివిధ విభాగాల సిబ్బంది

బీచ్‌రోడ్డు: ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టి.. పర్యావరణాన్ని కాపాడుకుందామని 'సాక్షి' మీడియా విశాఖపట్నం బ్రాంచ్ మేనేజర్ బి.వి.ఎస్.ఎస్.చంద్రరావు పిలుపునిచ్చారు. 'సాక్షి' పత్రిక 15వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం ఆర్కేబీచ్‌లో బీచ్ క్లీన్ కార్యక్రమం జరిగింది. ఎడిటోరియల్, రిపోర్టింగ్, అడ్మినిస్ట్రేటివ్, యాడ్స్, సర్క్యులేషన్, టీవీ తదితర విభాగాలకు చెందిన సిబ్బంది బీచ్‌రోడ్డులోని కాళీమాత ఆలయం ఎదురుగా ఆర్.కె.బీచ్‌లో చెత్త, వ్యర్థాలను ఏరివేసి.. జీవీఎంసీ పారిశుధ్య సిబ్బందికి అందజేశారు. పరిపాలన రాజధాని కాబోతున్న విశాఖ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పిలుపునిచ్చారు.



చెత్త ఏరుతున్న సాక్షి సిబ్బంది

మేయర్ల మర్యాదపూర్వక కలయిక

- నగర మేయర్ హరివెంకటకుమారితో భేటీ అయిన కటక్ మేయర్

డాబాగార్డెన్స్: నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారిని కటక్ మేయర్ సుభాష్ చంద్రసింగ్ దంపతులు గురువారం జీవీఎంసీలోని మేయర్ చాంబర్లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జీవీఎంసీ చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులు, ప్రాజెక్టుల గురించి మేయర్ హరి వెంకటకుమారి కటక్ మేయర్‌కు వివరించారు. జీవీఎంసీ ఆర్థిక వ్యవస్థ, బడ్జెట్, భూగర్భ మురుగునీటి వ్యవస్థ, తాగునీరు, సోలార్ ప్రాజెక్టులు, వీధి దీపాల నిర్వహణ, పారిశుధ్యం, కాపులుప్పాడలోని జిందాల్ విద్యుత్ ప్రాజెక్టు, మల్టీ లెవల్ కార్ పార్కింగ్, కమాండ్ కంట్రోల్ సెంటర్, రోడ్లు, డ్రైనేజీ నిర్వహణ, అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్, ముఖ్యంగా సచివాలయం, వలంటీర్ వ్యవస్థ తదితర అంశాలను కటక్ మేయర్‌కు వివరించారు. అనంతరం నగర మేయర్ కటక్ మేయర్‌ను సత్కరించి, జ్ఞాపిక అందజేశారు.

నగరంలో నేడు

- ఉదయం 10 గంటలకు ఆరిలోవ పినాకిల్ ఆస్పత్రిలో చిన్నపిల్లల్లో గుండె సంబంధిత వ్యాధులపై ఉచిత వైద్య శిబిరం
- ఉదయం 10 గంటలకు ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ క్యాంపస్‌లోని వై.వి.ఎస్.మూర్తి ఆడిటోరియంలో జీ-20 యూనివర్సిటీ కనెక్ట్ అనే అంశంపై సదస్సు
- ఉదయం 11 గంటలకు బీచ్‌రోడ్డు గేట్ వే హోటల్‌లో వాల్‌మార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భారతదేశంలో సన్నకారు రైతులకు ఆసరా, వ్యవసాయ పద్ధతులు, బలోపేతంపై అవగాహన
- ఉదయం 11 గంటలకు జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జీవీఎంసీ మెయిన్‌గేట్ వద్ద ధర్నా
- ఉదయం 11.30 గంటలకు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద విశాఖ క్యాబ్ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ
- సాయంత్రం 4 గంటలకు జీవీఎంసీ ఆధ్వర్యంలో ఏయూ కన్వెన్షన్ హాలులో మాక్ జీ-20 కాంక్లేవ్

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.59,780
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.54,800
వెండి(కిలో):	రూ.75,400

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

బ్రాయిలర్ (లైవ్)	: రూ.107
స్కిన్	: రూ.184
స్కిన్‌లెస్	: రూ.194

కోడిగుడ్ల ధరలు

	రూ.లలో (వందకు)
విశాఖ	450.00
విజయనగరం	454.00
శ్రీకాకుళం	454.00

మద్యం మత్తులో హోంగార్డు హల్‌చల్



హోంగార్డు గోపి

అల్లిపురం: మద్యం మత్తులో హోంగార్డు ఓ అపార్ట్‌మెంట్‌లోని ప్రవేశించి మహిళలు, వాచ్‌మన్ పట్ల అసభ్యంగా మాట్లాడి బెదిరింపులకు పాల్పడ్డాడు. మహారాణిపేట పోలీసులు తెలిపిన వివరాలివీ.. సూర్యాబాగ్ పోలీస్ మెస్ ఎదురుగా గల రఘు అపార్ట్‌మెంట్‌లోకి పోలీస్ బ్యారక్స్‌లోని కమ్యూనికేషన్ విభాగంలో పనిచేస్తున్న హోంగార్డు గోపి గురువారం మధ్యాహ్నం బైక్‌తో ప్రవేశించాడు. అతనిని వాచ్‌మన్ ప్రశ్నించడంతో గోపి అపార్ట్‌మెంట్‌లోని మహిళలు, వాచ్‌మన్‌పై అసభ్య పదజాలంతో రెచ్చిపోయాడు. నన్నే వెళ్లిపోమంటారా? మీ పని చూస్తానంటూ బెదిరించడంతో.. అపార్ట్‌మెంట్ వాసులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు హోంగార్డును అదుపులోకి తీసుకున్నారు.

దూరవిద్య పరీక్ష ఫలితాల విడుదల

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రం పరిధిలో 11 పీజీ కోర్సుల మొదటి, రెండవ సెమిస్టర్ పరీక్షల ఫలితాలు విడుదల చేసినట్లు కేంద్రం సంచాలకుడు ఆచార్య కె.విశ్వేశ్వరరావు తెలిపారు. ఎంఏ ఇంగ్లిష్, హిందీ, తెలుగు, ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, ఫిలాసఫీ, మ్యాథ్‌మెటిక్స్, ఎంజేఎంసీ కోర్సుల ఫలితాలను www.andhrauniversity-sde.com పొందుపరిచినట్లు పేర్కొన్నారు.

వేసవి క్రీడా శిబిరాలకు దరఖాస్తుల ఆహ్వానం

విశాఖ స్పోర్ట్స్: క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో వేసవి క్రీడా శిబిరాలు నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నారు. మే ఒకటో తేదీ నుంచి నెలరోజుల పాటు ఈ శిబిరాలు జరగనున్నాయి. 8 నుంచి 14 ఏళ్లలోపు చిన్నారులకు ఈ వేసవి శిక్షణా శిబిరాలు నిర్వహించనున్నారు. చిన్నారులకు శిక్షణ ఇచ్చేందుకు ఆయా క్రీడా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, కోచ్‌లు, పీఈటీలు, సీనియర్ ఆటగాళ్లు ఈనెల 31లోగా జిల్లా క్రీడా ప్రాధికార సంస్థలో దరఖాస్తు చేసుకోవచ్చని చీఫ్ కోచ్ సూర్యారావు తెలిపారు. మరిన్ని వివరాలకు 8912705392లో సంప్రదించవచ్చు.

రేపు జాబ్‌మేళా

మురళీనగర్: ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కంచరపాలెం ప్రభుత్వ ఉపాధి కార్యాలయం (క్లరికల్) ప్రాంగణంలో శనివారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఉపాధి కల్పనాధికారి సీహెచ్ సుబ్బిరెడ్డి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సాయి కృష్ణ చైతన్య తెలిపారు. ఆరోజు ఉదయం 10 గంటలకు హెటిరో ల్యాబ్స్ లిమిటెడ్, పొలగాని సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, స్టీల్ సిటీ సెక్యూరిటీ లిమిటెడ్, క్లోవ్ టెక్నాలజీస్, పేజెస్ సంస్థ, ట్రస్ట్ సర్వీసెస్, సువర్ణభూమి సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపిక జరుగుతుందన్నారు.

కె.కె.లైన్‌లో పలు రైళ్లు రద్దు

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ పరిధి మల్లిగుడ-చత్రిపుట్ సెక్షన్ పరిధిలో జరుగుతున్న భద్రత పనుల కారణంగా కె.కె.లైన్‌లో ప్రయాణించే పలు రైళ్లను శుక్ర, శనివారాల్లో రద్దు చేశారు. ప్రయాణికులు ఈ మార్పులు గమనించి సహకరించాలని వాల్తేర్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి కోరారు. • ఈ నెల 24న విశాఖపట్నం-కిరండూల్ (08551) పాసింజర్ రద్దు • ఈ నెల 25న కిరండూల్-విశాఖపట్నం(08552) పాసింజర్ రద్దు • ఈ నెల24న విశాఖపట్నం-కోరాపుట్ (18512) ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రద్దు • ఈ నెల 24న కోరాపుట్- విశాఖపట్నం (18513) ఇంటర్‌సిటీ రద్దు

'23 నంబర్ కలిసొచ్చింది'

మహారాణిపేట: తెలుగుదేశం పడిలేచిన కెరటం అని విశాఖ ఉత్తర ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. దేవుడు చక్కగా స్క్రిప్ట్ ఇచ్చాడని, 23 సంఖ్య తమకు కలిసివచ్చిందన్నారు. తెలుగుదేశం నగర కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. హిందూపురం నుంచి ఇచ్ఛాపురం వరకు ఒకటే గాలి వీచిందన్నారు. పార్టీ విశాఖపట్నం పార్లమెంట్ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ 23వ తేదీన 23 మంది ఎమ్మెల్యేల ఓటుతో టీడీపీ ఎమ్మెల్సీ గెలవడం ఒక సందేశమన్నారు.

గ్రేహౌండ్స్, సైమండ్ బ్లూస్ విజయం

విశాఖ స్పోర్ట్స్ : యూసీసీ టీ20లో భాగంగా గురువారం వైఎస్ఆర్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో యూసీసీపై నాలుగు పరుగుల తేడాతో గ్రేహౌండ్స్ విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన గ్రేహౌండ్స్ తొమ్మిది వికెట్లకు 140 పరుగులు చేసింది. ప్రతిగా యూసీసీ తొమ్మిది వికెట్లు కోల్పోయి 136 పరుగులు చేసింది. రైల్వేస్టేడియంలో జరిగిన మరో మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన గెలాక్సీ సీసీ ఆరు వికెట్లకు 126 పరుగులు చేసింది. ప్రతిగా సైమండ్ బ్లూస్ ఐదు వికెట్లు కోల్పోయి విజయాన్నందుకుంది.